# విజిలెన్స్ - వెల్ ఫేర్

మొన్నామధ్య వో రోజు నే నాఫీసులో వుండగా, శివాజీరావు వస్తే క్యాంటీన్‌కి తీసుకెళ్ళాను. వాష్ బేసినుకి దగ్గరగా, కాష్ కౌంటర్‌కి దూరంగా, ఫానుకింద బల్ల వేయించుకుని టోకెల్లిచ్చి టిఫినూ కాఫీ తెచ్చుకుని కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్నాం.

మా ఆఫీసులో చాలమంది అంతే. కబుర్లు చెప్పుకోవాలంటే క్యాంటీన్‌కే చేరుతారు; గుంపులు గుంపులుగా, జంటలు జంటలుగా; సహాధ్యాయులతో, అతిథులతో.

ఎకౌంట్స్ సెక్షన్స్ వాళ్లు, ఇంజనీరింగ్ సెక్షన్‌వాళ్లు, వర్క్‌షాపు వాళ్ళు, కమ్మర్షియల్ వాళ్ళు ఇట్లా రకరకాల సెక్షన్లలో వుంటూ రకరకాల వుద్యోగాలు చేసుకుంటున్న వాళ్ళు, ఆఫీసుకి సంబంధించిన ఇతర టేస్టుల ప్రభావంవల్ల కబుర్లు చెప్పుకోడానికి ఎవరెవర్నో ఎంచుకుంటూ చేరుతారక్కడ.

అంచేత ఏ వేళప్పుడు చూసినా అక్కడ రెండువందల మందికి తక్కువ లేకుండా దొరుకుతారు.

ఉన్నట్టుండి, ఆ మూల ఎంట్రెన్స్ గేటుదగ్గిర అలికిడైంది. తలుపులు మూతపడ్డాయి.

విజిలెన్స్ ఆఫీసర్‌గారు, ఆయన అసిస్టెంటు, స్టెనోగ్రాఫరు, హాలు లోపలికొచ్చారు. బయట ఇద్దరు సెక్యూరిటీ జవాన్లు కాపలా వుండడం అద్దాల తలుపులలోంచి కనబడింది.

వి. ఓ. గారు ఒక కుర్చీ ఎక్కి నిలబడ్డారు. "అందరూ యిటు చూడండి.... మీలో చాలామంది ఈ కంపెనీ ఉద్యోగులు అని నేను భావిస్తున్నాను. మీ మీ రిఫ్రెష్‌మెంట్స్ అవగానే మీ పేర్లు, డెజిగ్నేషన్లు, కోడ్ నెంబర్లు చెప్పి నాతో సహకరించవలసిందిగా కోరుతున్నాను!"

రెండు నిమిషాలలో ఎంట్రన్స్ గేటుదగ్గిర ఆయన కూర్చోడానికి కుర్చీ, రాసుకోడానికి టేబిలు ఏర్పాటయ్యాయి.

విజిలెన్స్ ఆఫీసరుగారు అన్నారు, "చూడండి! మన కంపెనీ మీకు ఈ వూళ్లో ఏ ఇతర కంపెనీ చెయ్యనన్ని సదుపాయాలు చేసింది. మీలో చాలామంది ఉండడానికి క్వార్టర్సు ఇచ్చింది. అయితే క్వార్టర్సు తీసుకొని అద్దెల కిచ్చేసేవాళ్ళు తయారయ్యారు. మీ కుటుంబాలలో ఎవరికి జబ్బు చేసినా బాగుచెయ్యడానికి ఆస్పత్రి కట్టించింది కంపెనీ. అయితే మీకే జబ్బు అని, ఓ పక్క డ్యూటీకొచ్చి, కొంత టైం హాస్పిటల్లో గడిపి, ఏవో మందులు తీసేసుకుని లోకోపకారాలకి తలపడ్డారు కొందరు. మీ కోసం కంపెనీ క్యాంటీన్ కట్టించింది. అయితే, మీరు పన్లు మానేసి గంటలు గంటలు క్యాంటీన్లో గడపడం, లోకం మీద ముచ్చట్లు ఇక్కడ చెప్పుకోడం సాగిస్తున్నారు. చాలా రోజులుగా అబ్జర్వ్ చేస్తున్నాను. ఇది అరికట్టాలని నన్ను ఎం. డి. గారు నియమించారు. అంచేత మీరు చక చకా పేర్లు చెప్పేసెయ్యండి."

అందరికంటె ఆఖర్న నేను వెళ్ళాను. ఫలానా టైంకి క్యాంటీన్‌లో వున్నానని నోట్‌చేసి, సంతకం పెట్టించుకున్నారు.

క్యాంటీన్ నుంచి వెళ్ళిన వాళ్ళలో సగంమంది తిన్నగా సీట్లకు వెళ్ళకుండా వెల్ఫేర్ ఆఫీసరుగారి దగ్గిరకెళ్ళి రక్షించండి మహాప్రభో అని మొరెట్టుకున్నారట. తరువాత తెలిసింది.

ఒక వారం తరువాత శివాజీరావు కనబడ్డాడు. "ఏమైంది మీ ఆఫీసు గొడవ? మీ క్యాంటీన్ మూసేశారా?" అనడిగాడు.

"అదా!.... లేదు. వెల్ఫేర్ ఆఫీసరే గెల్చారు."

"అదెలాగ?"

"నీకు తెలుసుగా! మా ఫ్యాక్టరీ, ఆఫీసు, ఎమినిటీస్; అన్నీ కూడా విష్ణుమూర్తిగారే అంటే మా మేనేజింగ్ డైరెక్టరుగార్.

మా విష్ణుమూర్తిగారు సర్వాంతర్యామి. మా ఫ్యాక్టరీ హాస్పిటల్ పేరు విష్ణుమూర్తి క్లినిక్. మా కాలనీ పేరు విష్ణుమూర్తి నగర్. మా థియేటర్ పేరు విష్ణుమూర్తి కళాకేంద్రం. మా కంపెనీలో అమ్మాయిల కాలేజీ పేరు విష్ణుమూర్తి వుమెన్స్ కాలేజీ. క్యాంటీన్ పేరు విష్ణు విలాస్. అంతేకాక, మా కాలనీలో సెలూన్, బట్టలషాపు, కిరాణాషాపు ఏది తెరిచినా విష్ణుమూర్తిగారి పేరు పెట్టాల్సిందే.

అంచేత వెల్ఫేర్ ఆఫీసరుగారు సరాసరి ఆయన దగ్గరి కెళ్ళి 'అయ్యా, ఇదీ సంగతి. ఇక ఇలాగయితే ఉద్యోగస్తు డెవ్వడూ క్యాంటీన్‌కే కాదు; ఆస్పత్రికి కూడా వెళ్ళడు. తమ పేరు మరుగున పడిపోతుంది. ఆపైన మీ దయ' అని గోల చేసేడు. దాంతో విష్ణుమూర్తిగారు ప్రసన్నులై విజిలెన్స్ ఆఫీసర్‌గారికి యిలాంటి వాటిలో జోక్యం అనవసరం అనీ; కంపెనీలో తయారయ్యే వస్తువులు, ముడి పదార్థాలు, యంత్రాల విడిభాగాలు, వాహనాల కుపయోగించే ఇంధనం, స్టేషనరీ లాంటివి చోరీ కాకుండా చూడ్డమే ఆయన పని అని స్పష్టంగా రాసి పంపేరు. ఆ విధంగా___"

"అయితే సరే. రేపు మీ ఆఫీసుకి వస్తాను."

"ఏమైనా పనుందా?"

"పనేమీ లేదు కనకనే కాసేపు క్యాంటీన్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుందాం," అన్నాడు శివాజీరావు.

(22-9-79)